
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : గురువారం సా : 6.34 గం.

సహర్ : శుక్రవారం ఉ: 4.51 గం.



గాయపడిన మహిళను అంబులెన్స్‌లోకి తరలిస్తున్న స్థానికులు

పెళ్లింట విషాదం

- వధువును తీసుకొచ్చేందుకు వెళ్తుండగా ప్రమాదం
- జోగిపేట వద్ద బోల్తా పడ్డ ట్రాక్టర్
- వరుడి తరఫున బంధువులు ముగ్గురు దుర్మరణం
- బోసిబోయిన బాచారం

పాపన్నపేట/జోగిపేట, మార్చి 27: పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో శ్మశాన నిశబ్ధం అలుముకుంది. అప్పటి వరకు ఉత్సాహంగా.. సంతోషంగా బంధువులతో సందడిగా ఉన్న ఆ ఇల్లు ఏడుపులు.. పెడబొబ్బలతో మారుమోగిపోయింది. తెల్లవారితే పెళ్లి జరుగుతుందని భావించిన ఆ కుటుంబం ఇప్పుడు కల్యాణ మండపంలో కాకుండా ఆస్పత్రిలో కొందరు తమ బంధువుల మృతదేహాల వద్ద మరికొందరు క్షతగాత్రుల వద్ద పడిగాపులు పడుతున్నారు. మెదక్ జిల్లా అందోల్ మండలం మాన్‌సాన్‌పల్లి శివారు మూలమలుపు వద్ద పెళ్లి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో వరుడు తరుఫున బంధువులు ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో చిన్నారులతో సహా 20 మంది వరకు గాయపడ్డారు. జిల్లాలోని పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన సుంద పోచయ్య-శ్యామమ్మ కుమారుడు రాములుకు సంగారెడ్డి జిల్లా అందోలు పట్టణానికి చెందిన పూజారి యాదయ్య కుమార్తెతో గురువారం పెళ్లి జరగనుండగా.. బంధువులంతా వచ్చేశారు. ఇంట్లో పెళ్లి సందడి నెలకొనగా.. వారి ఆచారం ప్రచారం పతానం అనే కార్యక్రమం జరిపి వధువు.. వరుడి ఇంటికి తీసుకువచ్చేందుకు సుమారు 29 మంది వరుడి తరఫు బంధువులు ఓ ట్రాక్టర్‌లో వధువు గ్రామానికి బయలుదేరారు. అయితే, ఇందులో ముగ్గురికి అదే చివరి ప్రయాణం అవుతుందని ఊహించలేదు. మార్గమధ్యలో సంగారెడ్డి జిల్లా అందోలు మండలం మన్‌సాన్‌పల్లి శివారులోని మూలమలుపు వద్ద.. అతి వేగంతో ఉన్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా కొట్టింది. దీంతో బాచారం గ్రామానికి చెందిన రావుగారి బూదమ్మ(52), జెట్టిగారి సంగమ్మ(45) చనిపోగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రావుగారి ఆగమ్మ(45) చనిపోయారు. సుమారు 20 మంది వరకు గాయపడగా.. ఒకరిద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రెండేళ్ల చిన్నారితో సహా పలువురు చిన్నారులూ గాయపడటంతో ఆ ప్రాంతం అంతా రోదనలతో నిండిపోయింది. ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా పడటంతో ఏం జరిగిందో అర్థం అయ్యే లోపల ఇద్దరు చనిపోయారు. ఆగమ్మ అనే మహిళ ఆస్పత్రిలో కన్నుమూసింది. పెండ్లి కుమారుని అమ్మమ్మ, చిన్నమ్మకు కూడా తీవ్ర గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.

నెలరోజుల క్రితమూ..

సరిగ్గా నెల రోజుల క్రితం శుభకార్యానికి వెళ్లి వస్తూ ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. ఆ ఘటన మరువక ముందే శుభకార్యానికి వెళ్తూ మరో ముగ్గురు చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

మృతిచెందిన వారు



బూదమ్మ(ఫైల్)



సంగమ్మ(ఫైల్)



ఆగమ్మ(ఫైల్)

మూగపోయిన వరుడి ఇల్లు

నూతన వధువును తీసుకొచ్చేందుకు వెళ్లిన బంధువులు చనిపోయారనే విషయం తెలియగానే రెండు ఊర్లలో విషాదం అలుముకున్నది. వరుడి ఇంటి వద్ద ఉన్న వారంతా సంఘటనా స్థలానికి, అక్కడి నుంచి ఆస్పత్రులకు వెళ్లడంతో ఆ ప్రాంతమంతా బోసిపోయింది. చనిపోయిన వారి మృతదేహాలు జోగిపేట ఏరియా ఆస్పత్రిలో ఉండగా, గాయపడిన వారిలో కొందరిని సంగారెడ్డి ఏరియా ఆస్పత్రికి, హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.



బోసిపోయిన వరుడి ఇల్లు



మెదక్ కోర్టు ఆవరణలో ప్రారంభమైన ఈ-సేవ కేంద్రం

మెదక్ జిల్లా కోర్టు ఆవరణలో
ఈ-సేవ కేంద్రం


- వర్చువల్‌గా ప్రారంభించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్

మెదక్ అర్బన్, మార్చి27 : మెదక్ జిల్లా కోర్టు ఆవరణలో ఈ-సేవ కేంద్రం ఏర్పాటైంది. బుధవారం వర్చువల్‌గా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ప్రారంభించారు. ఈ కేంద్రంతో ప్రస్తుతం కేసులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. కోర్టు ఉత్తర్వుల సాఫ్ట్ కాపీలను వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పొందవచ్చు. ఈ-కోర్టు మొబైల్ యాప్ డౌన్‌లోడింగ్, సర్టిఫైడ్ కాపీలు, పిటిషన్లు, కౌంటర్ల ఈ-ఫైలింగ్, ఈ-సంతకాలు పొంది, వాటిని అప్‌లోడ్ చేయొచ్చు. అందరికీ న్యాయం అందుబాటులో ఉండాలన్న రాజ్యాంగ లక్ష్యాన్ని నెరవేర్చాలని సుప్రీంకోర్టు ఈ-కమిటీ నిర్ణయించిన మేరకు అన్ని జిల్లా కోర్టుల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ జితేందర్, జూనియర్ సివిల్ జడ్జి రీటాలాల్‌చంద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగసుశీల తదితరులు పాల్గొన్నారు.

రెండు రైస్‌మిల్లులకు నోటీసులు

నర్సాపూర్, మార్చి 27: నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలో ఉన్న రెండు రైస్‌మిల్లులు సకాలంలో సీఎంఆర్ బియ్యం ఇవ్వకపోవడంతో యజమానులకు ఆర్ఆర్‌యాక్టు కింద నోటీసులు జారీ చేస్తున్నట్లు తహసీల్దార్ కమలాద్రి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దచింతకుంట సమీపంలో ఉన్న వీరభద్ర, మహాలక్ష్మి రెస్‌మిల్లులకు ఆర్ఆర్‌యాక్టు కింద నోటీసులు జారీ చేశామన్నారు. మహాలక్ష్మి రైస్‌మిల్లు 7,310 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన రూ.24.46 కోట్లు, వీరభద్ర రైస్‌మిల్లు 6,006 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన రూ.20.10 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ రెండు మిల్లుల యజమాని పాండురంగం అని, బకాయి పడిన డబ్బును సకాలంలో చెల్లించని పక్షంలో ఆర్ఆర్ యాక్టు ప్రకారం ఆస్తులు జప్తు చేసే అవకాశం ఉంటుందని తహసీల్దార్ హెచ్చరించారు.

ఈత.. కావద్దు గుండెకోత



పోతంశెట్‌పల్లి సమీపంలో ఎంఎన్ కెనాల్‌లో స్నానాలు చేస్తున్న యువకులు(ఫైల్)

- సరదా మాటున పెనుప్రమాదం
- చెరువుల్లో స్నానాలు చేసే సమయంలో అప్రమత్తత అవసరం
- లేదంటే భారీ మూల్యం చెల్లించాల్సిందే

కొల్చారం, మార్చి 27 : వేసవికాలంలో యువత, చిన్నారులు కాల్వలు, చెరువులు, బావుల్లో ఈత కోసం వెళ్లి ప్రాణాలను బలితీసుకుంటున్నారు. చెరువుల్లో స్నానానికి వెళ్లి నీటమునిగి చనిపోతున్న సంఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. చెరువుల్లో ఎక్స్‌కవేటర్లతో ఎక్కడపడితే అక్కడ మట్టి తవ్వకాలు జరపడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. చెరువుల్లోకి నీరు చేరగానే అవి ఎక్కడ ఉన్నాయో ఎవరికీ అర్థం కావడం లేదు. స్నానానికి చెరువుల్లోకి దిగగానే ఒకేసారి లోతుల్లోకి వెళ్లి ప్రాణాలు వదులుతున్నారు. సరదాగా ఈత కోసం దిగి ప్రాణాలను పోగొట్టుకుని వారి కుటుంబాలకు తీరని శోకం మిగులుస్తున్నారు. నీట మునిగిన వారిని కాపాడే ప్రయత్నంలోనూ కొందరు ఈత వచ్చినవారు మునిగిపోయిన సంఘటనలు అనేకం. ఇలా ఈత సరదా విషాదం నింపిన ఘటనలు జిల్లా వ్యాప్తంగా ఎన్నో చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలతో పలు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. మరి కొన్ని కుటుంబాల్లో ఉన్న ఒక్కగానొక్క సంతానం మృతి చెందడంతో జీవితాంతం తీరని విషాదం నెలకొంటుంది. జాగ్రత్తలు పాటించి సరదా సమయాన్ని విషాదం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. కనీస సూచనలు పాటిస్తే నీటి గండం నుంచి బయటపడవచ్చు.

గత సంఘటనలు..

- గతంలో కొల్చారం మండలం సంగాయిపేట గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు దసరా సెలవుల్లో బతుకమ్మకు పువ్వు తేవడానికి వెళ్లి చెరువులో స్నానం చేసేందుకు దిగగా జేసీబీ గుంత అందరినీ పొట్టనపెట్టుకున్నది.
- మూడు రోజుల క్రితం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన వడ్ల కార్తీక్‌చారి చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లి మృత్యువాత పడ్డాడు
- రెండు రోజుల క్రిత్రం గుమ్మడిదల మండలం వీరన్నగూడెం గ్రామంలోని హోలీ ఆడుకున్న తర్వాత ఇద్దరు యువకులు స్నానానికి దిగగా గల్లంతయ్యారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహాలు లభ్యమయ్యాయి.
- రెండు రోజుల క్రితం చిలప్‌చెడ్ మండలం చండూరు గ్రామానికి చెందిన గట్టుమీది నర్సింహులు చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు.
- కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలానికి చెందిన సిద్దిరాములు ఏడుపాయల్లో చెక్‌డ్యాంలో నీట మునిగి బుధవారం చనిపోయారు.

జాగ్రత్తలు పాటిస్తే మేలు

- యువత మద్యం, మత్తు పదార్థాలు తీసుకుని నీటిలోకి దిగవద్దు.
- చెరువులు, కాల్వల్లో అధిక లోతుల్లోకి వెళ్తూ సాహసాలు చేయకూడదు.
- చెరువుల్లోకి దిగేముందు ఇసుక, మట్టి తవ్వకాలు ఉంటే గుంతలు ఉంటాయి. వాటిని గమనించాలి. తవ్వకాలు జరిపే వైపు స్నానానికి వెళ్లకూడదు.
- కాల్వల్లో నీటి ప్రవాహ వేగం ఎక్కువగా ఉంటుంది. ఈత రాని వారు అస్సలు నీటిలో దిగవద్దు.
- గ్రామాల్లో చెరువులు, కుంటలు ఎక్కువగా ఉంటాయి. సెలవుల్లో చిన్నారులు, యువత ఎక్కువగా ఇక్కడ స్నానాలు చేసేందుకు వెళ్తుంటారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువులు, కాల్వల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలి.



\- మహ్మద్ గౌస్, ఎస్ఐ, కొల్చారం



మెదక్ పట్టణంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, తదితరులు

వందశాతం పోలింగ్ లక్ష్యం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

మెదక్ అర్బన్, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం పోలింగే లక్ష్యమని, అందరూ ఓటింగ్‌లో పాల్గొని మెదక్‌ను ప్రథమ స్థానంలో నిలపాలని ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో బుధవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డితోపాటు వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారి

సెక్టార్ అధికారులు సాంకేతికపై
అవగాహన పెంచుకోవాలి

- పోలింగ్ కేంద్రాల్లో విధిగా మాక్‌పోలింగ్ నిర్వహించాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాక్‌పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 27 : సెక్టార్ అధికారులు సాంకేతికపై అవగాహన పెంచుకోవాలని ఎన్నికల అధికారి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సెక్టార్ అధికారులకు బుధవారం నిర్వహించిన మాక్‌పోల్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధికారులు గతంలో ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ, మళ్లీ శిక్షణ చాలా ముఖ్యమైనదన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కొత్తగా ఉంటాయన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుగే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. పోలింగ్ రోజు ప్రతీ కేంద్రంలో మాక్‌పోలింగ్ విధిగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రతీ సెక్టార్ అధికారులకు 12 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందని, వారు ప్రతీ పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పీవోలకు ఏప్రిల్ 1న, ఏపీవోలకు 2న ఎన్నికల శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణకు హాజరుకాని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. శిక్షణ సమయంలో ట్రైనింగ్ మెటీరియల్ అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఈవీఎంలు ఏర్పాటు చేసి మాక్‌పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉన్నతాధికారుల పొరపాటు..
తహసీల్దార్లకు గ్రహపాటు

- చౌటకూరు, నిజాంపేట ఎమ్మార్వోలకు అందని వేతనాలు
- ఐదు నెలలుగా జీతం లేక సతమతం
- అసెంబ్లీ ఎన్నికల వేళ పదోన్నతిపై బదిలీ
- కేడర్ స్ట్రెంత్, పే బిల్ సౌకర్యం లేని మండలానికి పోస్టింగ్ ఇవ్వడంతో ఈ దుస్థితి

పుల్‌కల్, మార్చి 27 : అధికారుల తప్పిదం ఇద్దరు తహసీల్దార్‌లకు శాపంగా మారింది. పదోన్నతి కల్పించి సిబ్బంది లేని మండలానికి పోస్టింగ్ ఇవ్వగా వేతనం అందక సతమతమవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ బదిలీపై వచ్చిన వారికి ఐదునెలలుగా జీతం అందడం లేదు. పే బిల్ సౌకర్యం లేకపోవడంతో వేతనం జమ కావడం లేదు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఐదు నెలలుగా ఆ అధికారులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

చౌటకూరు మండలానికి ఇన్‌చార్జిలే దిక్కు

2020 జూలైలో అవిభాజ్య పుల్కల్ మండలంలోని 13 రెవెన్యూ గ్రామాలను వేరు చేస్తూ చౌటకూర్ కేంద్రంగా కొత్త మండలాన్ని ఏర్పాటు చేశారు. చౌటకూర్‌ను మండలంగా ఆవిర్భవించినప్పటికీ, తగినంత సిబ్బంది (కేడర్ స్ట్రెంత్)ని కేటాయించలేదు. మండలంలో కార్యకలాపాలు కొనసాగేందుకు వీలుగా అప్పట్లో ఇతర మండలాలకు చెందిన నయాబ్ తహసీల్దార్‌ను డిప్యూటేషన్‌పై ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. ఇటీవల వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌లతోనే పాలన కొనసాగుతూ వచ్చింది. దీంతో వారికి ఇతర మండలాల నుంచి వేతనం పొందేవారు.

పదోన్నతిపై తహసీల్దార్‌గా వచ్చి..

అసెంబ్లీ సాధారణ ఎన్నికల దృష్ట్యా గతేడాది అక్టోబరు నెలలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నయాబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జి.ఈశ్వరీరాణి తహసీల్దార్‌గా పదోన్నతిపై సంగారెడ్డి జిల్లాకు వచ్చారు. ఆమెను కలెక్టరేట్ లేదా ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన అధికారి (ఏవో)గా నియమించాలి. అయితే, తహసీల్దార్‌గా పదోన్నతినిచ్చి నేరుగా చౌటకూర్ తహసీల్దార్‌గా నియమించడం ఆమెకు శాపంగా మారింది. అప్పట్లో జిల్లా ఉన్నతాధికారులు చేసిన తప్పిదానికి ఆరు నెలలుగా ఆమెకు వేతనం అందడంలేదు. కేడర్ స్ట్రెంత్ లేని మండలానికి తహసీల్దార్‌గా నియమించడం అధికారుల అవగాహన రాహిత్యానికి అద్దంపడుతున్నది. ఒకవేళ చౌటకూర్ తహసీల్దార్‌గానే నియమించాలనుకుంటే ఆమెకు ఎక్కడైనా తహసీల్దార్ హోదాకు తగ్గకుండా ఇతర కార్యాలయాల్లో పోస్టింగ్ ఇచ్చి, డిప్యూటేషన్‌పై చౌటకూర్ తహసీల్దార్‌గా నియమిస్తే అక్కడ వేతనం పొందేవారు. కేడర్ స్ట్రెంత్, పే బిల్ సౌకర్యం లేని మండలానికి తహసీల్దార్‌గా నియమించడంతో వేతనం లేక అవస్థలు పడుతున్నారు.

అనారోగ్య సమస్యలు..

అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఈశ్వరీరాణికి 2019లో గుండెకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరగగా, 2022లో గ్లాడ్ బ్లాడర్‌కు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. హైదరాబాద్ నగరానికి చెందిన తహసీల్దార్ ఈశ్వరీరాణి ప్రస్తుతం జోగిపేట పట్టణంలో నివాసముంటూ విధులకు హాజరవుతున్నారు. తహసీల్దార్ సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు నిర్వహిస్తుండటంతో ప్రతీ రోజు కార్యాలయానికి హాజరవడం తప్పనిసరి. తనకు వేతనం రావడం లేదని భూ పరిపాలన శాఖ(సీసీఎల్ఏ)తో పాటు రెవెన్యూ అసోసియేషన్ దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ, ఎలాంటి స్పందనలేదు. ప్రతీ నెలా ఈఎంఐలు, ఆసుపత్రి ఖర్చులు, మందుల కొనుగోలు, కుటుంబ పోషణ నిర్వహణ తదితర ఖర్చులకు డబ్బు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

నిజాంపేట తహసీల్దార్‌ది ఇదే కథ

నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటైన నిజాంపేట మండల తహసీల్దారు రాజాగణేష్‌ది ఇదే పరిస్థితి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నర్వ మండలం నయాబ్ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ తహసీల్దార్‌గా పదోన్నతిపై సంగారెడ్డి జిల్లాకు వచ్చారు. ఆయనను కూడా కేడర్ స్ట్రెంత్ లేని నిజాంపేట మండలానికి ఎమ్మార్వోగా నియమించారు. రాజాగణేష్‌కు కూడా ఐదు నెలలుగా వేతనం అందడం లేదు. ఇద్దరు అధికారులు గతంలో విధులు నిర్వహించిన పూర్వపు కార్యాలయాల్లో కూడా పే బిల్ కావడంలేదు. దీనికి తోడు లాస్ట్ పే సర్టిఫికెట్ (ఎల్‌పీసీ) కూడా తీసుకోలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్లకు వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు కోరుతున్నారు.

కొత్త భవనాలకు ఆస్తి పన్నులు లేవా?

జహీరాబాద్, మార్చి 27: జహీరాబాద్ పట్టణం అంతకంతకు విస్తరిస్తున్న నేపథ్యంలో నూతన భవనాలు కూడా అదేస్థాయిలో వెలిశాయని, ఆ భవనాలకు పన్నులు వేయకపోవడమేంటని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామ కిరణ్ ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఎంతసేపూ పాత భవనాల చుట్టూ తిరుగుతూ పన్నులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, నూతనంగా నిర్మితమైన పెద్ద భవనాల విషయం ఊసెత్తకపోవడం దారుణంగా ఉన్నదన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నారాయణఖేడ్, మార్చి 27: నీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ అన్నారు. బుధవారం ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో బోరు బావుల రీ డ్రిల్లింగ్ పనులను వైస్ చైర్మన్ దారం శంకర్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సంవత్సరం ఎండల తీవ్రత అధికంగా ఉన్నదని, అందువల్ల ముందస్తుగానే నీటి ఎద్దడి పరిస్థితులను గుర్తించి అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వివేకానంద్, సవితాహన్మాండ్లు, నాయకులు శెట్టిశంకర్, చేతన్, బాలయ్య లక్ష్మయ్య సిబ్బంది పాల్గొన్నారు.



బోరు బావి రీ డ్రిల్లింగ్ పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్

కరువు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం..

● కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్



లక్ష్మీపూర్‌లో ఎండిపోయిన పంటలను పరిశీలించి మహిళా రైతుతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

బెజ్జంకి, మార్చి 27: నీరు లేక పంటలు ఎండిపోవడం లేదని, నీరు ఎక్కడ ఇవ్వాలి.. ఎప్పుడు ఇవ్వాలనే విషయాన్ని ప్రభుత్వం ఆలోచించాలని.. అసలు కరువు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. బుధవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిడ్ మానేరు నుంచి 02 టీఎంసీల నీటిని అన్నపూర్ణ (అనంతగిరి) ప్రాజెక్టులో వదిలి బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల్లోని చెరువులు, కుంటలు నింపితే రైతులు కోట్లాది రూపాయాల పంట పండించుకునేవారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో చెరువులు, కుంటలు నింపడంతో బోరు బావుల్లో నీరు ఉండి మోటార్‌లతో పంటలకు నీరు పారించుకున్నామని రైతులు చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మేడిగడ్డ వద్ద మరమ్మతులు చేపట్టి ఒక కాఫర్ డ్యాం కట్టి నీటిని ఎత్తిపోస్తే ఎల్ఎండీ, మిడ్ మానేరు నిండేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి ఇంతవరకు చేయకపోవడంతో రైతులు తీసుకున్న రుణాలను కట్టాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పై బ్యాంకులకు గ్యారంటీ ఇచ్చి బ్యాంకుల అధికారులు గ్రామాల్లోకి రాకుండా, రుణాలు కట్టాలని రైతులకు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. అకాల వర్షానికి పంటలు దెబ్బతిని నష్టపోయామని ఇప్పుడు కట్టలేని పరిస్థితిలో ఉన్నామని రైతులు చెబుతున్న పుస్తెల తాళ్లు అమ్మి అయిన సరే రుణాలు కట్టాలని బ్యాంకు అధికారులు వేధించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుదని రైతులు అధైర్యపడవద్దని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం!

● రెండేళ్ల అద్దె డబ్బులివ్వాలని సిబ్బందితో భవన యజమాని వాగ్వాదం

● త్వరలో అందించేలా కృషిచేస్తామని హామీ ఇచ్చిన వైద్యసిబ్బంది



పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం వేస్తున్న యజమాని

జహీరాబాద్, మార్చి 27: జహీరాబాద్ పట్టణంలోని ఈఎస్ఐ డిస్పెన్సరీకి ఆ శాఖ రెండేళ్లుగా అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో బుధవారం భవన యజమాని తాళం వేశాడు. అద్దె చెల్లించాలని యజమాని పలుమార్లు ఈఎస్ఐ ఆస్పత్రికివెళ్లి అక్కడ పనిచేసే సిబ్బందిని కోరినా ఫలితం దక్కలేదు. దీంతో ఆగ్రహం చెందిన ఆయన ఆస్పత్రికి వెళ్లి ఏకంగా తాళం వేయడంతో అందులో పనిచేసే సిబ్బంది, ఆస్పత్రికి వచ్చిన రోగులు గంటపాటు ఇబ్బందులుపడ్డారు. అందులో పనిచేసే సంబంధిత అధికారులు స్థానికంగా నెలకొన్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించడంతో త్వరలో చెల్లిస్తామని హామీఇచ్చారు. దీంతో అతను తాళం తీశాడని వైద్య సిబ్బంది వివరించారు. నెలకు రూ.12 వేల చొప్పున రెండేళ్లకుగాను సుమారు రూ.2.40 లక్షల పై చిలుకు ఇవ్వాల్సి ఉన్నదని వైద్య సిబ్బంది విరించారు. పదేళ్లుగా ఈఎస్ఐ ఆస్పత్రి ఇదే భవనంలో కొనసాగుతున్నది.



సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయ ద్వారాలు

29 నుంచి లక్ష్మీనృసింహస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు

● తరలిరానున్న వేలాదిమంది భక్తులు

● ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు



ఆలయంలో కొలువైన మూలవిరాట్ లక్ష్మీనృసింహస్వామి

వర్గల్, మార్చి 27: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాల సందర్భంగా క్షేత్రంలోని ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాలు, ప్రాంగణమంతా రంగులతో మెరుగులు దిద్దారు. ఆలయం చుట్టూ కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలు అలంకరింపజేశారు. స్వామివారిని భక్తులు దర్శించుకునే విధంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. క్షేత్రంలో అక్కడక్కడ తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నాచగిరి క్షేత్రం పరిధిలోని తూప్రాన్, గజ్వేల్ వెళ్లే రహదారిపై, హైదరాబాద్ నుంచి సిద్దిపేట వేళ్లే రాజీవ్ రహదారి ప్రజ్ఞాపూర్ వద్ద స్వాగత తోరణం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బస్సులు

నాచగిరి నృసింహస్వామి క్షేత్రంలో బ్రహోత్సవాల సందర్భంగా ఆర్టీసీ వారు భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. మేడ్చల్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హైదరాబాద్, సికింద్రాబాద్ డిపోల నుంచి నాచగిరి క్షేత్రం వరకు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశారు. నాచగిరి క్షేత్రంలో జరిగే నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. ఈనెల 29న ప్రారంభమయ్యే ఉత్సవాలు ఏప్రిల్ 9న శత ఘటాభిషేకం, ఉగాది పండుగతో ముగియనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వృక్షశాస్త్ర జాతీయ సదస్సు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్

సిద్దిపేట క్రైం, మార్చి 27: సిద్దిపేట పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వృక్షశాస్త్ర విభాగంలో రెండురోజులపాటు జరగనున్న జాతీయ సదస్సులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా జాయింట్ డైరెక్టర్ కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్ హాజరై మాట్లాడారు. జీవవైవిధ్యం ప్రాముఖ్యతను వివరించారు. జీవవైవిధ్యం విధ్వంసం కాకుండా చూడాలని కోరారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ కాకతీయ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రామిరెడ్డి మాట్లాడుతూ మొక్కలను పెంచడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలించవచ్చని, గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించవచ్చని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ ముస్తఫా మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని సహజ పరిస్థితులను ఉపయోగించి ఏ విధంగా రక్షించవచ్చు అనే అంశాన్ని వివరించారు. ఇస్రో సీనియర్ సైంటిస్ట్ సుధాకర్‌రెడ్డి ఫ్లోరా, ఫనాల గురించి తెలియజేశారు. హెడ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ తెలంగాణ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ అరుణ ప్లాంట్ సైన్సెస్ ఈ రోజుల్లో విద్యార్థులకు అన్నివిధాలుగా ఉపయోగపడుతున్నదని తెలియజేశారు. ఈ జాతీయ సదస్సుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర,కేరళ, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి పరిశోధకులు హాజరయ్యారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం

చేర్యాల, మార్చి 27: కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకంలో బుధవారం మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమైంది. గ్రామశివారులోని గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఏర్పాటుచేసిన పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీరు కొంత సేపు ఎగిసిపడింది. దీంతో ఎక్స్‌కవేటర్ బకెట్ అడ్డుపెట్టి నీటి ప్రవాహాన్ని నిలువరించే ప్రయత్నం చేశారు. నీటి సరఫరా నిలిపేయడంతో తవ్వకం పనులు తిరిగి చేపట్టారు.

2030 నాటికి మానవ మేధస్సుతో సరిపోలే కృత్రిమ మేధస్సు

● హెదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సిబా ఉద్గత



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు రూరల్, మార్చి 27: 2030 నాటికి మానవ మేధస్సుతో కృత్రిమ మేధ (ఏఐ) సరిపోలుతుందని, ప్రస్తుతం అది మనం నిర్దేశించిన పని చేయడానికే పరిమితమైందని హెదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, ఏఐలో ప్రఖ్యాత నిపుణుడు డాక్టర్ సిబా ఉద్గత అంచనా వేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండురోజుల జాతీయ కార్యశాల ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫీషియల్ జనరల్ ఇంటలిజెన్స్ సాధించడానికి సాధారణ జ్ఞానంతో కూడిన కృత్రిమ మేధ నమూనాలను అభివృద్ధి చేయడం ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. సమాచార (డేటా) సేకరణలో గోప్యత, భద్రత, న్యాయబద్ధతల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధ అభివృద్ధి ఆవశ్యకతను చెప్పారు. కృత్రిమ మేధలో శోధించేవారు, తాము కనుగొన్నది సమాజంపై చూపే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమస్యను గుర్తించి, దానిని నిర్వహించి, అందుకు తగ్గ పరిష్కారాలను చూపాలని విద్యార్థులను ప్రోత్సహించారు. భారతీయ నిపుణులు సమస్యకు పరిష్కారం కనుగొనడంలో దిట్ట అయినా, దానిని గుర్తించి, నిర్వచించడంలో వెనుకబడినట్టు డాక్టర్ ఉద్గత పేర్కొన్నారు. వేగంగా మారుతున్న కృత్రిమ మేధ రంగంలో పునఃనైపుణ్యం పొందం, నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ఆవశ్యకతను జియో ప్లాట్ ఫారం ప్రిన్సిపల్ డేటా సైంటిస్ట్ డాక్టర్ ఆకాంక్ష కునూర్ చెప్పారు. ఈ రంగంలో రాణించాలంటే, పరిశ్రమ భాగస్వామ్యంతో నిరంతర అభ్యాసంతోపాటు ఇతరులతో కలిసి పనిచేయాలని సూచించారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ రాధికా మామిడి, ఆవిష్కరణల సాకారంలో యువత పాత్రను తెలిపారు. భవిష్యత్ గురించి విద్యార్థులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. వర్చువల్ సభాధ్యక్షత వహించిన గీతం సైన్స్ డీన్ ప్రొఫెసర్ కొల్లూరు శ్రీకృష్ణ మాట్లాడుతూ, గణితం, కృత్రిమ మేధ పరిశోధనలో కొత్త మార్గాలను అన్వేషించాలని, ఈ కార్యశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాదాపు 150 మంది పాల్గొన్న ఈ వర్క్‌షాప్, కృత్రిమ మేధ, పెద్ద భాషా నమూనాలలో తాజా పురోగతులపై చర్చ, పరస్పర సహకారానికి వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కార్యశాల నిర్వాహకుడు డాక్టర్ మోతహర్ రెజా, సమన్వయకర్తలు డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, డాక్టర్ కృష్ణ, కుమ్మరి తదితరులు పాల్గొన్నారు.

దేవాదుల కెనాల్‌లో పోసిన మట్టి తొలగింపు

● కొండపాక మండలానికి నీటి విడుదలకు లైన్‌క్లియర్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



తపాస్‌పల్లి కెనాల్‌లో వేసిన మట్టిని తొలగిస్తున్న దృశ్యం

చేర్యాల/కొండపాక, మార్చి 27: కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలానికి సాగునీరు రాకుండా మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో రిజర్వాయర్ డీ4 కెనాల్‌లో వేరే ప్రాంతానికి చెందిన కొంతమంది మట్టిపోసి అడ్డుకట్ట వేశారు. ఈనెల 23న 'కెనాల్‌కు అడ్డుకట్ట.. సాగునీటి గోస' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై అధికారులు స్పందించి కాలువలో పోయించిన మట్టి, మొరాన్ని బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా దేవాదుల ఏఈఈ రాజశేఖర్, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు పోలీసు బందోబస్తు నడుమ ఎక్స్‌కవేటర్లతో మట్టిని తొలగింపచేశారు. కొద్దిరోజుల క్రితం దేవాదుల గంగారం నుంచి పంపింగ్ ప్రారంభించగా, బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించారు. రెండురోజుల క్రితం నీటి పంపింగ్ నిలిచిపోగా, బుధవారం తిరిగి పంపింగ్ ప్రారంభించారు. చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండిపోతుండగా ముందస్తుగా ఇక్కడి రైతులకు నీటి విడుదల చేసిన అనంతరం కొండపాకకు మళ్లించాలని స్థానిక రైతులు కోరడంతో కొద్దిరోజుల క్రితం కాలువలో మట్టిపోయించడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై రాజకీయ ఒత్తిళ్లతో మట్టిని తొలగింప చేయడంతో కొండపాక మండలానికి నీటి తరలింపునకు అడ్డంకులు తొలగిపోయాయి. ఇదిలా ఉండగా కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ కొమురవెల్లి మండల నాయకులు బుధవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా మల్లన్న ఆలయ డైరెక్టర్ మేడికుంట శ్రీనివాస్, నాయకులు ఎక్కలదేవి శ్రీనివాస్, పబ్బోజు రాములుచారి, గొల్లపల్లి శ్రీనివాస్, పోతుగంటి రవి తదితరులు హైదరాబాద్‌లో కొమ్మూరిని కలిశారు. చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండిపోకుండా రైతులను ఆదుకునేందుకు సాగునీటిని అందించేలా సంబంధిత అధికారులతో సంప్రదించి పరిష్కరించాలని కోరారు. దీంతో కొమ్మూరి సానుకూలంగా స్పందించారు.

871 మంది కుష్ఠు అనుమానితులు

● వెంటనే చికిత్స ప్రారంభానికి చర్యలు

● 544 బృందాలతో ఇంటింటి సర్వే

● 6,91,408 మందికి స్క్రీనింగ్.. ముగిసిన సర్వే

మెదక్ అర్బన్, మార్చి 27: మెదక్ జిల్లావ్యాప్తంగా కుష్ఠు(లెప్రసీ) సర్వేలో విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నాయి. కేంద్ర సర్కార్ అనుమానించినట్లే వేగంగా ఈ వ్యాధి విస్తరిస్తోంది. అంతరించి పోయిందనుకున్న తరుణంలో చాపకింద నీరులా వ్యాధి విస్తరిస్తున్నట్లు తెలుస్తుండడం గమనార్హం. 544 బృందాలతో ఈనెల 13 నుంచి బుధవారం వరకు చేపట్టిన ఇంటింటి సర్వేలో జిల్లాలోని 1,76,408 గృహాల్లో 6,91,240 మందిని స్క్రీనింగ్ చేశారు. ప్రతి వ్యక్తిని పూర్తిస్థాయిలో పరీక్షించారు. అందులో 871 మందికి కుష్ఠు అనుమానిత లక్షణాలున్నట్లు గుర్తించారు. అనుమానితులను వ్యాధి నిర్ధారణ కోసం వైద్యుల వద్దకు సిఫారసు చేశారు. 519 మందిని పరీక్షించగా.. ఇంకా 361 మందిని పరీక్షించున్నారు. ఇప్పటి వరకు కొత్తగా 8 పాజిటివ్ కేసులు నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే చికిత్స ప్రారంభించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపడుతుంది. ఇంటింటి సర్వే విజయవంతంగా ముగిసిందని ఆశాఖ అధికారులు తెలిపారు.

ఘనంగా ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే

సంగారెడ్డి అర్బన్, మార్చి 27: సంగారెడ్డి శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే బుధవారం నిర్వహించారు. సీనియర్ కేజీ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ అవార్డుల పురస్కారాలు ప్రదానం చేశారు.

తపాస్‌పల్లిలో బండరాళ్ల బ్లాస్టింగ్‌పై అధికారుల విచారణ

● డ్రిల్లింగ్ మిషన్ ఇతరత్రా సామగ్రి సీజ్



విచారణ చేస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మైనింగ్ అధికారి సైదులు, ఎస్ఐ నాగరాజు

చేర్యాల, మార్చి 27: కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామ శివారులోని అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా పలువురు బండరాళ్లు కొడుతూ విక్రయిస్తున్న విషయమై అదే గ్రామానికి చెందిన రమేశ్ చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. కొమురవెల్లి తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సైదులుయాదవ్, ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా బండరాళ్ల బ్లాస్టింగ్ చేయకూడదని, అక్రమంగా విక్రయించడం తప్పని నిర్వాహకులకు సూచించారు. వెంటనే పనులు నిలిపివేయాలని ఆదేశించి డ్రిల్లింగ్ మిషన్, ఇతరత్రా సామగ్రిని సీజ్ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని, వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

పిన్ని మందలించడంతో యువకుడి ఆత్మహత్య



గుట్టమీది నర్సింహులు(ఫైల్)

చిలప్‌చెడ్, మార్చి 27: జీవితంపై విరక్తి చెందిన యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చిలప్‌చెడ్ మండలం చండూరు గ్రామానికి చెందిన గుట్టమీది రాజయ్యకు కుమార్తె మాధవి, కుమారుడు నర్సింహులు(20) ఉన్నారు. రాజయ్య మొదటి భార్య పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే మృతిచెందడంతో అనితను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా మొదటి భార్య కూతురు మాధవిని కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. అయితే రాజయ్య నాలుగేళ్ల క్రితం మరణించగా.. నర్సింహులు పిన్ని వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో చెడు అలవాట్లకు బానిసై.. ఖాళీగా తిరుగుతుండడంతో పిన్ని మందలించింది. దీంతో మంగళవారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన నర్సింహులు సాయంత్రమైనా ఇంటికి తిరిగిరాలేదు. గ్రామానికి చెందిన బ్రాహ్మనోల్ల నర్సింహులు చెరువులోకి గేదెలను వదలగా ఒక్కసారిగా పైకి వచ్చాయి. వెంటనే వెళ్లి చూడగా గుట్టమీది నర్సింహులు మృతదేహం కనిపించడంతో గ్రామస్థులకు చెప్పాడు. వారంతా వచ్చి బయటకు తీశారు. మృతుడి సోదరి మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



నరేందర్‌రెడ్డి(ఫైల్)

మనోహరాబాద్, మార్చి 27: చింతకాయలు తెంపడానికి చెట్టు పైకి ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి మృతిచెందాడు. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాన్సువాడ నరేందర్‌రెడ్డి(53) మంగళవారం పొలం వద్ద చింత చెట్టు ఎక్కి కాయలు తెంపుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతిచెందాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకెళ్లి చూడగా చనిపోయి కనిపించాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, మార్చి 27: మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతిచెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ నారాయణగౌడ్ వివరాల మేరకు గ్రామానికి చెందిన ద్యాప శివకుమార్(26) కొన్నిరోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆరోగ్యం క్షీణించడంతో మనస్తాపానికి గురై ఈనెల 23న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న ద్యాప రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటర్ల ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు



కారు, బైక్ ఢీకొన్న దృశ్యం

నిజాంపేట, మార్చి 27: కారు, బైక్ ఢీకొని ద్విచక్ర వాహనదారులకు గాయాలైన సంఘటన నిజాంపేట మండలంలో బుధవారం చోటు చేసుకున్నది. మండల పరిధిలోని నందగోకుల్ గ్రామానికి చెందిన మ్యాదరి కరుణాకర్, చౌడ స్వామి (టీఎస్15 ఈహెచ్ 6973) నెంబరు బైక్‌పై రామాయంపేట వైపు వెళ్తున్నారు. నిజాంపేట మండల శివారులోని చల్మెడ కమాన్ వద్ద చేగుంట నుంచి సిద్దిపేటకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నారాయణ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న నిజాంపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

అత్తను హత్యచేసిన అల్లుడికి రిమాండ్



పోలీసుల అదుపులో ఏసు

టేక్మాల్, మార్చి 27: ఆస్తి కోసం అత్తను హత్యచేసిన అల్లుడిని పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం .. తంపులూరు గ్రామానికి చెందిన మహిళ ఈనెల 21న హత్యకు గురైంది. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలం మర్వెల్లి గ్రామానికి చెందిన వరుసకు అల్లుడైన ఏసును అదుపులోకి తీసుకుని విచారించగా ఆస్తి కోసం హత్యచేశానని ఒప్పుకున్నాడు. దీంతో బుధవారం రిమాండ్‌కు తరలించారు.

బైక్‌ను తగులబెట్టిన దుండగులు



కాలిపోయిన బైక్

చిలప్‌చెడ్, మార్చి 27: ఇంటి ముందు నిలిపిన బైక్‌ను గుర్తు తెలియని దుండగులు తగులబెట్టారు. చిలప్‌చెడ్ గ్రామానికి చెందిన గాండ్ల రాములు 8 నెలల క్రితం గ్లామర్ బైక్‌ను కొనుగోలు చేశాడు. మంగళవారం రాత్రి తన ఇంటి ముందు బైక్ పార్క్ చేసి పడుకున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో బైక్ తగులబడిపోతున్నదని కాళ్ల జగదీష్ రాములును లేపాడు. వెంటనే వారు మంటలను చల్లార్చారు. ఎవరో గుర్తు తెలియని దుండగులు ప్రహరీ దూకొచ్చి బైక్‌ను తగులబెట్టారని బాధితుడు రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకులు దొంగిలించిన అంతర్రాష్ట్ర పాత నేరస్థుడి అరెస్ట్

● 3 సెల్‌ఫోన్లు, 18 బైకులు స్వాధీనం, బ్యాంకు ఖాతా ఫ్రీజ్



నేరస్థులతో క్రైమ్ టీం ఎల్బీనగర్ ఏసీపీ ఏ.కృష్ణయ్య, ఎస్‌హెచ్‌వో ఎల్.రామాంజనేయులు, డీఐ ఏ.సుధాకర్

కొత్తపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసైన కారు డ్రైవర్ పలు నేరాల పాల్పడి జైలు ఊచలు లెక్కించి వచ్చి, బైకుల దొంగతనాలు మొదలుపెట్టాడు. ఫేస్‌బుక్ ఫ్రెండ్ సహకారంతో వాటిని విక్రయిస్తూ ఎల్బీనగర్ పోలీసులకు చిక్కాడు. ఆ ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకొని 3 సెల్‌ఫోన్లు, 18 బైకులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎల్బీనగర్ డివిజన్ ఏసీపీ ఏ.కృష్ణయ్య తమ కార్యాలయంలో బుధవారం కేసుల వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప, ప్రొద్దటూరు వాజ్‌పేయినగర్ వాసి అయిన మల్లె భరత్‌కుమార్(28) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెడు అలవాట్లకు బానిసై నేరాల బాటపట్టాడు. ఆంధ్రప్రదేశ్‌లో అతడిపై 14 కేసులు నమోదయ్యాయి. 2022లో ప్రొద్దటూరులో పోక్సో కేసు, గతేడాది కాజీపేట పీఎస్‌లో ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడిన కేసులు 9, బద్వేల్‌లో 4 బైకు చోరీల కేసులు నమోదయ్యాయి. బద్వేల్ సబ్ జైలు నుంచి విడుదలైన భరత్ మలక్‌పేట మూసారాంబాగ్‌కు మకాం మార్చాడు. మెట్రోస్టేషన్లు, ఇళ్ల బయట పార్క్ చేసిన కొత్త పల్సర్ బైకుల లాక్‌ను మాత్రమే విరగ్గొట్టి దొంగిలించడం మొదలుపెట్టాడు. ఈ ఏడాది మూడు కమిషనరేట్ల పరిధిలో 18 పల్సర్ బైకులను దొంగిలించాడు. నారాయణపేట మరికల్, రాకొండ గ్రామానికి చెందిన వలిమోని చెన్నయ్య అలియాస్ కిట్టు(22) సంగారెడ్డి బీడీఎల్ భానూరు, ఏదుల నాగులపల్లిలో ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భరత్‌కుమార్‌కు అతడు ఫేస్‌బుక్‌లో పరిచయమయ్యాడు. భరత్‌కుమార్ దొంగిలించిన బైకులను అతడు కొనుగోలు చేసి రూ.30 నుంచి రూ.40 వేలుకు విక్రయించేవాడు.

17న ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ పార్కింగ్ వద్ద

ఈ నెల 17న ఎల్బీనగర్ మెట్రో వెహికల్ పార్కింగ్ వద్ద ఓ పల్సర్ బైకు చోరీ గురైందని ఫిర్యాదు అందడంతో క్రైమ్ టీం అప్రమత్తమై నేరస్థుడి కదలికలపై సాంకేతికంగా నిఘా పెట్టింది. మెట్రో పార్కింగ్ వద్ద దొంగిలించిన పల్సర్ బైకును భరత్‌కుమార్ డీవీఎం కాలేజీ వెనుక దాచేశాడు. దాన్ని మంగళవారం ఓ వ్యక్తికి విక్రయిచేందుకు/అందజేసేందుకు భరత్‌కుమార్ డీవీఎం కాలేజీ వద్దకు వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, బైకును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. బీడీఎల్ భానూరు నుంచి కిట్టు తన స్నేహితులను కలిసేందుకు మీర్‌పేటకు వచ్చేవాడు. అదే సమయంలో భరత్‌కుమార్ చోరీ చేసిన బైకుల విక్రయానికి సహకరించేవాడు. భరత్‌కుమార్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు అతడిని బీడీఎల్ భానూరులో అదుపులోకి తీసుకున్నారు. భరత్‌కుమార్ చోరీచేసిన 17 బైకులను, కిట్టు వద్ద ఒక బైకును స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కొన్ని బైకులకు రిజిస్ట్రేషన్ కూడా చేయించలేదు. కిట్టు బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.22,205లనూ ఫ్రీజ్ చేశారు. భరత్‌కుమార్‌పై రాచకొండ కమిషనరేట్ పరిధిలో 10 బైక్ చోరీ కేసులు, హైదరాబాద్ పరిధిలో 7 కేసులు, సైబరాబాద్ మియాపూర్ పీఎస్ పరిధిలో ఒక కేసు నమోదయ్యాయి. దొంగలను పట్టుకునేందుకు/గుర్తించేందుకు ఇళ్ల వద్ద, వాహనాల పార్కింగ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ కృష్ణయ్య సూచించారు. సమావేశంలో ఎస్‌హెచ్‌వో ఎల్.రామాంజనేయులు, డీఐ ఏ.సుధాకర్, క్రైమ్ టీం పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ

దుబ్బాక, మార్చి 27: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దుబ్బాకలోని పోలీ స్‌స్టేషన్‌ను ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులను పరిశీలించారు. నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాల వివరాలను తెలుసుకున్నారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు గంగ రాజు, రవికాంత్‌రావు తదితరులున్నారు.

నాచగిరి క్షేత్రంలో హుండీ ఆదాయం రూ. 10.68 లక్షలు


హుండీ కానుకలను లెక్కిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు, భక్తులు

వర్గల్, మార్చి 27: మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ శివరాజ్ పర్యవేక్షణలో జరిగిన హుండీ లెక్కింపులో నాచగిరి క్షేత్రంలో 64 రోజులకు గానూ రూ. 10,68,968 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుధాకర్, నరేందర్, పాండు, నర్సింహులుతో పాటు ఆలయ వేద పండితులు, భ్రమరాంబిక సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి మిరుదొడ్డి మండలంలో..

జీపీ భవనాలకు మోక్షమెన్నడో?

● ఏడాది క్రితం ఏడు గ్రామాలకు మంజూరు

● నాలుగు గ్రామాల్లో పనులు ప్రారంభించినా నేటికీ పూర్తికాని వైనం

● అద్దెభవనాలు, అరకొర వసతుల మధ్య పాలన

మిరుదొడ్డి, మార్చి 27: గత ప్రభుత్వ హయాంలో నూతన గ్రామపంచాయతీల పక్కా భవనాల కోసం శంకుస్థాపనలు చేసినా పనులు ముందుకుసాగడం లేదు. పరిపాలన సౌలభ్యం కోసం నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసినా, వాటికి పక్కా భవనాలు లేక పాలకవర్గం, సిబ్బందితో పాటు గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఒక్కో గ్రామపంచాయతీ భవనానికి ఎన్ఆర్ఐఈజీఎస్ ద్వారా ప్రభుత్వం రూ. 20లక్షలను మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

ఏడాది గడిచినా..

గతేడాది ఉమ్మడి మిరుదొడ్డి మండలానికి ఏడు గ్రామపంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయి. అందులో నాలుగు గ్రామాల్లో జీపీ భవనాల పనులు ప్రారంభించినా నేటికీ పూర్తికాలేదు. మరో మూడు గ్రామాల్లో అసలు పనులే ప్రారంభించకపోవడం గమనార్హం. ఉమ్మడి మిరుదొడ్డి మండలంలోని మల్లుపల్లి, బేగంపేట, లింగుపల్లి గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాల పనులను ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు స్లాబ్, పిల్లర్ల దశలోనే పనులు నిలిచి పోవడం గమనార్హం. కాసులా బాద్, వీరారెడ్డిపల్లి, పెద్దచెప్యాల గ్రామాల్లో ఇప్పటి వరకు పనులే ప్రారంభించలేదు. దీంతో పంచాయతీ సిబ్బంది అరకొర వసతులున్న అద్దెభవనాల్లో విధులు నిర్వహిస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలకు పక్కా భవనాల పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.


మల్లుపల్లిలో స్లాబ్ దశలో నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు

త్వరగా పనులను ప్రారంభించాలి



గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి. గ్రామాల్లో పంచాయతీ భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో సరైన సౌకర్యాలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలి.

- కనకరాజు, మాజీ ఉపసర్పంచ్, మల్లుపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జీపీ భవన నిర్మాణపనులకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులను చేయడం పూర్తయ్యింది. ఉమ్మడి మండలంలోని నాలుగు గ్రామాల్లో పనులను ప్రారంభించగా, మిగతా 3గ్రామాల్లో ప్రారంభించలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే అన్ని గ్రామాల్లో పనులను పూర్తయ్యేవిధంగా చూస్తాం.

- శ్రీనివాస్‌రెడ్డి, మండల పంచాయతీరాజ్ ఏఈ

మృతురాలి కుటుంబీకులకు గ్రామస్థుల చేయూత

హుస్నాబాద్ రూరల్, మార్చి 27: మండలంలోని తోటపల్లి గ్రామంలో పేద కుటుంబానికి చెందిన దొంతరవేని అఖిల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె సోదరి రవళి పేరిట గ్రామస్థులు రూ.1,06,500లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బుధవారం బాండ్ పేపర్లను కుటుంబసభ్యులకు అందించి ఉదారత చాటుకున్నారు. శంకర్ సోషల్ మీడియా వేదికగా స్నేహితులు, గ్రామస్థులు, ముదిరాజ్ సంఘ సభ్యుల సహకారంతో మృతురాలి సోదరి పేరిట డిపాజిట్ చేశారు.

విద్యాధరి క్షేత్రంలో చంద్రమౌళీశ్వర ప్రతిష్ఠాపనోత్సవాలు

వర్గల్, మార్చి 27: మండలంలోని విద్యాధరి క్షేత్రంలో శ్రీపరివార సమేత చంద్రమౌళీశ్వర స్వామి ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో యాగశాల ప్రవేశం, స్థాపిత దేవతాపూజలు, మహాస్నపనం, మూలమంత్రహవనము, చండీహవనం, పంచాయతన సహిత మూలమంత్రహవనం నీరాజనం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

చేర్యాలలో సీఐఎస్ఎఫ్ పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

చేర్యాల, మార్చి 27: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సీఐఎస్ఎఫ్ పోలీసు బలగాలతో కలిసి చేర్యాల పోలీసులు బుధవారం పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐలు దామోదర్, నాగరాజు, యూనస్ మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బీరప్పస్వామిని దర్శించుకున్న పల్లా

దూళిమిట్ట, మార్చి 27: మండలంలోని లింగాపూర్‌లో బీరప్ప కామరాతి కల్యాణం ఘనంగా జరిగింది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం స్వామివారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా మండలంలోని కూటిగల్ గ్రామంలో బుధవారం మృతి చెందిన చెప్యాల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పల్లా పరామర్శించారు. శ్రీనివాస్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

● **చేర్యాల:** మండలంలోని కడవేరుగు గ్రామంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని బుధవారం గ్రామమహిళలు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గదరాజు యాదగిరి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

విరమణ ఉద్యోగానికి మాత్రమే..


మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

కుకునూరుపల్లి, మార్చి 27: పదవీ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమేనని సమాజ సేవకు కాదని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంగోల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వంగ కృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి డీఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులు పిల్లలను తీర్చిదిద్దడంలో ముందుంటారని, అలాంటి వారికి సమాజంలో ఎప్పుడు గౌరవం ఉంటుందన్నారు. విరమణ అనంతరం కూడా సమాజ సేవకు ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు ముందుకు రావాలని ఆయన కోరారు. కాగా స్వచ్ఛంద విరమణ చేసిన మహేందర్‌రెడ్డి ఈ సందర్భంగా పాఠశాలకు రూ.17 వేలు విలువచేసే మైక్‌సెట్‌ను పాఠశాలకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం ప్రభాకర్ శాస్త్రి, వంగ మహేందర్ రెడ్డి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో నిలిచిన నాయకుడు మోహన్‌రెడ్డి

● టీపీసీసీ సభ్యుడు లింగమూర్తి

హుస్నాబాద్ టౌన్, మార్చి 27 : ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి అయిలేని మోహన్‌రెడ్డి అని టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి పేర్కొన్నారు. బుధవారం 1996లో నక్సలైట్ల చేతిలో హత్యకు గురైన నాయకుడు అయిలేని మోహన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో లింగమూర్తి మాట్లాడారు. జనం కోసం పని చేసిన నాయకులను ప్రజలు ఎప్పుడు మరచిపోరని తెలిపారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, బొలిశెట్టి సుధాకర్, కౌన్సిలర్లు తదితరులున్నారు.

కనుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం


నాగపురిలో వేదపండితుడు చూపుతున్నతలంబ్రాలకు నమస్కరిస్తున్న భక్తులు


చేర్యాలలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వసంతోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

చేర్యాల, మార్చి 27: మండలంలోని నాగపురి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్స వాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు వైష్ణవ సంప్రదాయం ప్రకారం కల్యాణోత్సవం జరిపారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వేర్వేరుగా పట్టువస్త్రాలు తీసుకువచ్చి సమర్పించారు. సమీప గ్రామాల భక్తులు అధికసంఖ్యలో కల్యాణోత్సవానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, సుంకరి మల్లేశం, మాజీ సర్పంచు బండమీది సంతోషి కరుణాకర్ మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం

మండల కేంద్రంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో వసంతోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధానార్చకులు మంగళగిరి శేషాచార్యులు మాట్లాడారు. హోలీ సందర్భంగా ఈ ఆలయంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వికాసతరంగిణి సభ్యులు పద్మ, సరోజిని, అనురాధ, శ్రీదేవి, లక్ష్మీ, తడక లింగమూర్తి, బండి గీత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైంది: ఎమ్మెల్సీ


ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయురాలు లిల్లీ దంపతులను సన్మానిస్తున్న కూర రఘోత్తంరెడ్డి

వర్గల్, మార్చి 27: సమాజంలో అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో మహోన్నతమైనదని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండలం శేరిపల్లి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఓఎస్ లిల్లీ ఉద్యోగ విరమణ అభినందనసభ గౌరారం లక్ష్మీమాధవఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తయారు చేసే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయులదని అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అదరాసుపల్లి శశిధర్‌శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, మండల విద్యాధికారి సునీత, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కనకరాజు, కృష్ణ సౌజన్య, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటరాజం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాలనాయకులు ఉన్నారు.

● **మిరుదొడ్డి:** మండలంలోని కాసులాబాద్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభుదాస్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, పీఆర్టీయూ నాయకులు తదితరులున్నారు.

గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

అక్కన్నపేట, మార్చి 27: మండలంలోని మల్లంపల్లి గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మాజీ సర్పంచ్ మార్క తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షులు కొలిపాక సంపత్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సూదుల సతీష్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా మంజూరైన సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. అలాగే మల్లంపల్లి నుండి కట్కూర్ వరకు తారు రోడ్డు నిర్మించాలని, ఇతర పలు అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎలక్షన్ కోడ్ ముగిసిన తర్వాత నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి పొన్నం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.


మంత్రి పొన్నంకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న మార్క తిరుపతి

కాంగ్రెస్‌లో మాజీ సర్పంచ్ చేరిక

మండలంలోని చాపగానితండా మాజీ సర్పంచ్ బానోతు లక్ష్మీవీరన్ననాయక్ ఆరుగురు మాజీ వార్డు సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగాపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యులు మాలోతు వెంకన్న, గుగులోతు మహేందర్, బానోతు గణేష్, భూక్య శ్రీకాంత్, భూక్య బీమా ఉన్నారు.

శభాష్.. నరేష్

● నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన రైతుబిడ్డ

● ఇబ్రహీంపూర్ యువకుడికి అభినందనల వెల్లువ


గ్రంథాలయంలో చదువుకుంటున్న కొత్తపల్లి నరేష్

నారాయణరావుపేట, మార్చి 27: ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది చాలా మంది యువకుల కల. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక్క ఉద్యోగం సాధించటమే కష్టం. అలాంటిది ఓ రైతు బిడ్డ ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి అంజవ్వ-సత్తయ్యల కుమారుడు నరేష్ తెలంగాణ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించిన ఉద్యోగ పోటీ పరీక్షల్లో ఏకకాలంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక య్యాడు. ఈ విషయం వెలుగుచూడడమే తరువాయి.. బంధుమిత్రులు, గ్రామస్థుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. తల్లిదండ్రులు వ్యవసాయ పని చేస్తూ నరేష్‌ను చదివించారు. సిద్దిపేటలో బీటెక్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. హైదరాబాద్ ఉస్మానియా క్యాంపస్‌లో ఎంటెక్ పూర్తి చేసిన నరేశ్ ప్రభుత్వ ఉద్యోగం సాధించటమే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యాడు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 124వ ర్యాంకు సాధించి ఉద్యోగం సాధించారు. అదే విధంగా ఇటీవల విడుదలైన అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్ సీర్ (టీపీబీవో), గ్రూప్-4 ఫలితాల్లోనూ మెరిట్ సాధించారు. వెరిఫికేషన్ పూర్తి కాగానే తాను ఎంచుకున్న ఉద్యోగంలో చేరనున్నట్లు అతడు తెలిపాడు.

తల్లిదండ్రుల కల నెరవేరింది

వ్యవసాయాన్ని నమ్ముకున్న మధ్యతరగతి కుటుంబం మాది. నేను ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది నా తల్లిదండ్రుల కల. ఇంజనీరింగ్ పూర్తి చేశాక పక్కా ప్రణాళికతో ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. నేను కొన్న పుస్తకాలతో పాటు జిల్లా గ్రంథాలయంలో పుస్తకాలు చదివి ప్రిపేర్ అయ్యాను. నా తల్లిదండ్రుల కలకు నా కృషి తోడై నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించాను. వెరిఫికేషన్ పూర్తి కాగానే అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఉద్యోగంలో చేరుతాను. నాకు సహకరించిన నా తల్లిదండ్రులకు, మిత్రులు, గ్రంథాలయ సిబ్బందికి కృతజ్ఞతలు.

- కొత్తపల్లి నరేష్, ఇబ్రహీంపూర్

ఇన్విజిలేటర్ తీరుపై విచారణ

కొండపాక, మార్చి 27 : మండలంలోని దుద్దెడ పదో తరగతి పరీక్షా కేంద్రంలో ఓ ఇన్విజిలేటర్ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా వ్యవహరించాడని ఫిర్యాదు చేయడంతో డీఈవో విచారణకు ఆదేశించినట్లు ఎంఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. తన పట్ల చంద్రబాను అనే ఇన్విజిలేటర్ అసభ్యకరంగా వ్యవహరించాడని పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు విద్యార్థిని ఫిర్యాదు చేసింది. దీంతో డీఈవో సదరు ఉపాధ్యాయుడిని పరీక్షా కేంద్రం విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో వెల్లడించారు. మూడు రోజుల్లో దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారని ఎంఈవో తెలిపారు.

శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువలేనివి


సంతాపం వ్యక్తం చేస్తున్న జిల్లా వైద్యాధికారులు,సిబ్బంది

సిద్దిపేట క్రైం, మార్చి 27: సీహెచ్‌వో శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువలేనివని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రీనివాస్‌రెడ్డి సంతాపసభలో పాల్గొని మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖలో ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్ సంఘాల నాయకులు శ్రీనివాస్‌రెడ్డికి సంతాపం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వినోద్ బాబ్జి, డాక్టర్ విజయరాణి, డాక్టర్ రజిని, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, నవీన్ రాజ్ కుమార్, హెచ్ఈవో గాలి రమేష్, హెల్త్ అసిస్టెంట్లు, ఫైలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబాన్ని పరామర్శించిన డీఎంహెచ్‌వో

కొండపాక, మార్చి 27 : వైద్య శాఖలో పనిచేస్తున్న జిల్లా సీనియర్ ఎంటమాలజిస్ట్, సీహెచ్‌వో కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన ఏర్వ శ్రీనివాస్‌రెడ్డి గుండెపోటుతో మరణించడంతో ఆయన కుటుంబాన్ని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దూరు, మార్చి 27: పేదలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం 'వైద్యాధికారి లీవ్.. ఇన్‌చార్జి వైద్యాధికారులు గైర్హాజర్' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో స్పందించారు. ఈ మేరకు ఆస్పత్రిని సందర్శించి అన్ని విభాగాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. వైద్యాధికారి రజిత లీవ్ ముగిసిందని గురువారం నుంచి విధులకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. మద్దూరు పీహెచ్‌సీ పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఎన్నికల కోడ్ ముగియగానే నియామకం చేసుకుంటామన్నారు. వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కుకునూరుపల్లి, మార్చి 27: మహిళలు స్వయంకృషితో ఆర్థికంగా ఎదగాలని నాబార్డు డీడీఎం తిమోతి తెలిపారు. లకుడారం, చిన్నకిష్టాపూర్ గ్రామాల్లో ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్ పై 20 రోజులపాటు ఉచిత శిక్షణను ఇచ్చారు. బుధవారం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఫాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్‌కి చాలా డిమాండ్ ఉందని, మహిళలు శిక్షణను ఉపయోగించుకొని సొంతంగా ఉపాధి అవకాశాలను పొందాలని, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఆర్డీఎస్ సంస్థ డైరెక్టర్ రాజలింగం సీసీ యాకుబ్, నాగరాజు సీఐలు కవిత, రేణుక, మంగ, స్వచ్ఛందసంస్థ కోఆర్డినేటర్ ప్రవీణ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై నాయకులకు అవగాహన

హుస్నాబాద్, మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై బుధవారం హుస్నాబాద్ ఐవోసీ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రామ్మూర్తి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డీటీ రుక్మిణి, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, బీఆర్ఎస్, సీపీఐ, బీజేపీ నాయకులు తదితరులున్నారు.

మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫామ్‌ల బాధ్యత

హుస్నాబాద్ రూరల్, మార్చి 27: విద్యార్థుల స్కూల్ యూనిఫామ్‌లు కుట్టే బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగించినట్లు డీఆర్డీవో జయదేవ్ ఆర్య పేర్కొన్నారు. బుధవారం పోతారం(ఎస్) గ్రామంలోని కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులతో ఆయన మాట్లాడారు. అడిషనల్ డీఆర్డీవో మధుసూదన్, డీపీఎంలు విద్యాసాగర్, కరుణాకర్, ఏపీఎంలు తిరుపతి, శ్రీనివాస్, సీసీ రవీందర్, వీవోఏ కనకతార తదితరులు ఉన్నారు.

అట్రాసిటీ ఫిర్యాదుపై ఏసీపీ విచారణ

మర్కుక్, మార్చి 27: మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన లింగని రవీందర్, మాజీ సర్పంచ్ బీజోటి అర్జున్‌సింగ్‌ల మధ్య ఎంతో కాలంగా భూ వివాదం నెలకొంది. కాగా రవీందర్ కుటుంబ సభ్యులు కబ్జాలో ఉన్నారు. సదరు భూమి తమకే చెందుతుందంటూ అర్జున్‌సింగ్ కుమారులు, మరికొంత మందితో కలిసి ఇటీవల రవీందర్‌తో గొడవ జరిగింది. ఈ గొడవలో తనను కులం పేరుతో దూషిస్తూ కుటుంబ సభ్యులపై దాడి చేశారని మర్కుక్ పోలీస్‌స్టేషన్‌లో రవీందర్ ఇచ్చిన ఫిర్యాదుపై గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, మర్కుక్ ఎస్ఐ మధుకర్‌రెడ్డిలతో కలిసి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురిని విచారించి వివరాలను సేకరించారు.ఆయన వెంట మర్కుక్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

దుబ్బాకలో తాళం వేసిన ఇంట్లో చోరీ

దుబ్బాక, మార్చి 27: పట్టణంలోని డబుల్‌బెడ్రూం ఇళ్లలోని తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. డబుల్‌బెడ్రూంలో నివాసం ఉంటున్న తోట్ల రేణుకా అనే గృహిణి తన భర్త, కూతురుతో కలిసి మంగళవారం బయటకు వెళ్లారు, రాత్రి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి, బీరువాలో గల అరతులం బంగారం, 30 తులాల వెండి, 35 వేల నగదును దొంగిలించారు. దుబ్బాక ఎస్ఐ గంగరాజు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆస్తిపన్ను చెల్లించని ఫంక్షన్‌హాల్‌కు తాళం

చేర్యాల, మార్చి 27: ఆస్తిపన్ను బకాయి చెల్లించని కారణంగా చేర్యాల మున్సిపల్ అధికారులు బుధవారం పట్టణంలోని పీఎంఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్ గేటుకు తాళం వేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ గోల్కొండ నర్సయ్య మాట్లాడుతూ.. అత్యధికంగా బకాయిపడిన కళాశాలలు, పాఠశాలలు, పెట్రోల్‌బంక్‌లు, సినిమా థియేటర్ల యాజమానులు వెంటనే పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. మార్చి 31వ తేదీలోగా ఆస్తిపన్ను బకాయి చెల్లించి వడ్డీ 90శాతం రాయితీ పొందాలని సూచించారు.

ఉపాధి హామీ విజేతలకు సన్మానం

గజ్వేల్, మార్చి 27: అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీని వంద రోజుల పాటు వినియోగించుకున్న కూలీలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో తమ హక్కును సంపూర్ణంగా వినియోగించుకుని వంద రోజుల ఉపాధి హామీ పనిని సద్వినియోగం చేసుకున్న గజ్వేల్ మండలం సింగాటం గ్రామానికి చెందిన పంబాల ఎల్లవ్వ, క్షీరసాగర్ కనకలక్ష్మి, కప్ప బుచ్చవ్వ, బరిగెల సుగుణలు మిగతా కూలీలకు ఆదర్శంగా నిలిచారన్నారు.

మెదక్ ఎంపీ సీటు బీజేపీదే..

● బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి నేమూరి ఆంజనేయులుగౌడ్

గజ్వేల్, మార్చి 27: మెదక్ ఎంపీ స్థానంలో బీజేపీ విజయం ఖాయమని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి నేమూరి ఆంజనేయులుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పార్థివేశ్వరాలయంలో బుధవారం పూజలను నిర్వహించి, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయనవెంట బీజేపీ పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేవ చేస్తా.. నిండు మనసుతో ఆశీర్వదించండి


మాట్లాడుతున్న వెంకట్రామారెడ్డి

సిద్దిపేట క్రైం, మార్చి 27: సేవ చేస్తా.. నిండు మనసుతో ఆశీర్వదించండని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి కోరారు. బుధవారం ఆయన సిద్దిపేట లో పార్టీ శ్రేణుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట ప్రాంత ప్రజల సమస్యలపై తనకు లోతైన అవగాహన ఉందన్నారు. ప్రజా సేవ కోసమే కలెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజా సేవలోకి అడుగుపెట్టానన్నారు. ఈప్రాంతంలో సుశిక్షితులైన, నిస్వార్థ బీఆర్ఎస్ కార్యకర్తలు ఉండటం నా అదృష్టం అని అన్నారు. కాగా సిద్దిపేట ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్స్ ముస్లిం పెద్దలు, అడ్వకేట్స్ అసోసియేషన్, సిద్దిపేట జిల్లా పద్మశాలీ సమాజం, సిద్దిపేట డాక్టర్స్ అంతా కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికే సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించారు.

బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయం: దుబ్బాక ఎమ్మెల్యే


గజ్వేల్‌లో మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 27: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి విజయం ఖాయమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని, రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్ రాజకీయాలు చేస్తూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల లాభానికి కృషిచేస్తుంద న్నారు. ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల రాజకీయ డ్రామాలను గమనిస్తున్నారన్నారు. వెంకట్రామారెడ్డి విజయానికి జిల్లాలోని బీఆర్ఎస్ కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయనవెంట రాయపోల్ జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, మాజీ సర్పంచ్‌లు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, రాయపోల్ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, నాయకులు తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


గౌడసంఘం సభ్యులకు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న కొమ్మూరి

చేర్యాల, మార్చి 27: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జనగామ డీసీసీ అధ్యక్షుడు, చేర్యాల మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రానికి చెందిన గౌడ కులసంఘం అధ్యక్షుడు రాజుతో పాటు సభ్యులు బుధవారం చేర్యాలలో కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్రాన్ని లూటీ చేసినా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో నాలుగింటిని అమలుచేసి చిత్తశుద్ధి చాటుకుందన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా అభివృద్ధిని పట్టించుకోకుండా కేవలం ప్రొటోకాల్ పేరుతో కాలం గడుపుతున్నాడని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.